ఆంధ్రజ్యోతి

andhrajyothy.com

ఆదివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 33.7 • కనిష్ఠం 18.4



నిర్మల్ జిల్లా వార్తలు

8

సోమవారం 10 ఫిబ్రవరి 2025



ఇరుకు గదులలో విధులు నిర్వహిస్తున్న తపాలా కార్యాలయ సిబ్బంది



ఖానాపూర్‌లో రెండు షట్టర్ రూమ్‌లలో నిర్వహిస్తున్న తపాలా కార్యాలయం

'తపాలా' చిరునామా.. నీవెక్కడా!?

- జిల్లాలో పలు తపాలా కార్యాలయాలకు తరచూ మారుతున్న చిరునామా
- ఐదేళ్లకోసారి పలుచోట్ల మారుతున్న పోస్ట్ ఆఫీస్ అడ్రస్
- నిర్మల్, భైంసా సబ్ డివిజన్ల పరిధిలో 14 కార్యాలయాలకు సొంత భవనాల కరువు
- అద్దె భవనాల్లోనే.. అరకొర సౌకర్యాలు
- చాలీచాలని గదులతో సిబ్బందికి తప్పని తిప్పలు
- పలుచోట్ల ఆధార్ కేంద్రాలతో అదనపు భారం
- 14 కార్యాలయాలకు రూ.3 వేల లోపే అద్దె చెల్లింపులు
- తక్కువ అద్దె కావడంతో కార్యాలయాల నిర్వహణకు దొరకని సరైన భవనాలు
- సొంత భవనాలు నిర్మించే వరకు అద్దె పెంచాలని డిమాండ్

ఖానాపూర్, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): దేశంలో ఎక్కడి నుంచి వచ్చిన ఉత్తరాలైనా సరే.. వాటిపై ఉన్న అడ్రస్ ఎంత మారుమూల గ్రామంలో ఉన్నా.. వెతికి మరీ గమ్యానికి చేర్చే తపాలా శాఖ పట్టణం నుంచి ప్రతీ మారుమూల గ్రామం వరకు జన జీవనంతో నిత్యం మమేకమై ఉంటుంది. అటువంటి తపాలా శాఖ కార్యాలయాలు జిల్లాలో పలుచోట్ల సొంత చిరునామాలు లేక కిరాయి పంచన నిర్వహణకు నోచుకుంటున్నాయి. ఇలా జిల్లాలో పలు తపాలా కార్యాలయాలు అడ్రస్ తరచూ మారుతుండడంతో ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. రెండేళ్ల వ్యవధిలోనే జిల్లాలోని ఖానాపూర్ తపాలా కార్యాలయం మూడు భవనాల్లోకి మారడం.. అవీ వేర్వేరు ప్రాంతాలు కావడంతో అక్కడి ప్రజలు అవస్థలు పడుతు న్నారు. అలాగే జిల్లాలో నిర్మల్, భైంసా రెండు సబ్ డివిజన్లు ఉండగా.. నిర్మల్ సబ్ డివిజన్ పరిధిలో 10, భైంసా సబ్ డివిజన్ పరిధిలో తొమ్మిది సబ్ పోస్ట్ ఆఫీస్‌లు ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. ఈ 19 పోస్ట్ ఆఫీస్‌లలో నిర్మల్, ముథోల్, పెద్దూర్, బోథ్, ఇచ్చోడ మినహా మిగతా 14 తపాలా కార్యాలయాలకు కనీసం సొంత భవనం లేకపోవడంతో కార్యాలయాన్ని అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారు. రోజువారీ సేవలో భాగంగా చిన్న మొత్తాల పథకాలు, ఉత్తరాల బట్వాడా, ఉత్తరాల బుకింగ్, ఐపీపీబీ బ్యాంకింగ్, ఎస్ఎస్సీ సేవలు, ఉపాధి హామీ సేవలు, చేయూత పెన్షన్ల పంపిణీ, ఆధార్ సేవలతో పాటు సేవింగ్ ఖాతాల నిర్వహణ, సుకన్య సమృద్ధి యోజన లాంటి ఎన్నో సేవలను నిర్వహించే తపాలా కార్యాలయానికి నిత్యం వంద నుంచి 200మంది జనం వచ్చి వెళ్తుంటారు. ఇలా జనం టతో ప్రత్యక్ష సంబంధాలు కలిగి ఉన్న ఈ ప్రభుత్వ కార్యాలయాలపై పాలకులు చిన్నచూపు చూస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అద్దెలోనే ఇంకా 14 కార్యాలయాలు

జిల్లాలో పోస్టల్ శాఖలో నిర్మల్ సబ్ డివిజన్‌తో పాటు భైంసా సబ్ డివిజన్లు ఉన్నాయి. ఈ రెండు సబ్ డివిజన్ పరిధిలో మొత్తం 19 తపాలా కార్యాలయాలు ఉన్నాయి. నిర్మల్ డివిజన్ పరిధిలో నిర్మల్, ఇందిరానగర్, కస్బా, మామడ, ఖానాపూర్, పెద్దూర్‌తో పాటు ఆదిలాబాద్ జిల్లా పరిధిలోని నేరడిగొండ, బోథ్, ఇచ్చోడ, గుడిహత్నూర్ సబ్ పోస్ట్ ఆఫీస్‌లు ఉన్నాయి. కాగా భైంసా సబ్ డివిజన్ పరిధిలో బాసర, ట్రిపుల్ ఐటీ బాసర, ముథోల్, భైంసా, కుంటాల, నర్సాపూర్(జి), దిలావర్‌పూర్, సోన్, చించోలి సబ్ పోస్ట్ ఆఫీస్‌లు ఉన్నాయి. వీటిలో నిర్మల్, ముథోల్, పెద్దూర్, బోథ్, ఇచ్చోడ మినహా మిగతా 14 తపాలా కార్యాలయాలకు కనీసం సొంత భవనాలు లేకపోవడంతో కార్యాలయాన్ని అద్దె భవనాలలో నిర్వహిస్తు న్నారు. రెండు సబ్ డివిజన్ల పరిధిలో అద్దె భవనాలలో నిర్వహిస్తున్న తపాలా కార్యాలయాలకు శాశ్వత భవనాలను నిర్మించేలా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.



మామడలో అద్దె భవనంలో నిర్వహిస్తున్న తపాలా కార్యాలయం

ఇరుకు గదులతో ఇబ్బంది

నిత్యం వందలాది మంది జనం తాకిడి ఉండే తపాలా కార్యాలయాలు దాదాపు జిల్లాలోని అన్ని అద్దె భవనాల్లో కేవలం రెండు గదులలో నిర్వహిస్తుండడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు తపాలా శాఖ సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కేవలం రెండు షట్టర్ రూమ్‌లలో నిర్వహిస్తున్న కొన్ని కార్యాలయాల్లో విలువైన పత్రాలను భద్రపరచడం ఇబ్బందికరంగా మారుతోందని చెబుతున్నారు. కార్యాలయాల్లో ఎస్పీఎం, పీఏ, పోస్ట్‌మెన్, ఇద్దరు డక్ సేవకులు నిరంతరం విధులు నిర్వహిస్తున్న నేపథ్యంలో వారికి కనీసం కూర్చుండేందుకు సరిపడా స్థలం కూడా లేకపోవడంతో ఇబ్బందుల నడుమ విధులను కొనసాగిస్తున్నట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక్కో సందర్భంలో కార్యాలయానికి జనం వస్తే కాలు పెట్టేందుకు ఖాళీ స్థలం కూడా ఉండ దని చెబుతున్నారు. శాశ్వత భవనాలు నిర్మాణం చేసే వరకు కార్యాలయాల భవనాల కోసం చెల్లిస్తున్న అద్దె పరిమితిని పెంపొందిస్తే విశాలమైన భవనాలను అద్దెకు తీసుకుని కార్యాలయాలను నిర్వహించవచ్చనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. ప్రస్తుతం పోస్టల్ సూపరింటెండెంట్ పరిధిలో రూ.3వేల వరకే అద్దెను చెల్లించే వెసులుబాటు ఉన్నందున అదనపు చెల్లింపుల కోసం ఎఫ్ఆర్‌ఏసీ కమిటీ వచ్చి పరిశీలించాల్సి ఉంటుందని చెబుతున్నారు. అదేవిధంగా సదరు కమిటీ పరిశీలనకు వచ్చి భవనాల కోసం చెల్లిస్తున్న అద్దెను కనీసం రూ.8 వేల వరకు అయినా పెంపొందిస్తే ఇరుకు గదుల సమస్య తీరుతుందని చెబుతున్నారు. ఈ విధంగా హైదరాబాద్‌లోని ఎఫ్ఆర్‌ఏసీ కమిటీకి పోస్టల్ సూపరిండెంట్ నివేదికను పంపితే బాగుంటుందని పలువురు కోరుతున్నారు.

అదనపు భారంగా ఆధార్ కేంద్రాలు

అసలే ఇరుకు గదుల్లో నిర్వహిస్తున్న తపాలా కార్యాలయాల్లో తాజాగా ప్రారంభ మైన ఆధార్ కేంద్రాలు అదనపు భారంగా మారినట్లు చెబుతున్నారు. జిల్లాలో నిర్మల్, ఖానాపూర్, భైంసా తపాలా కార్యాలయాల్లో ఆధార్ కేంద్రాలు నిర్వహిస్తు న్నారు. ఈ ఆధార్ కేంద్రాలకు అదనపు గదిని గాని ప్రత్యేకమైన ఆపరేటర్‌ను గాని ఏర్పాటు చేయకపోవడం ఇబ్బందికరంగా మారిందనే అభిప్రాయాలు వ్యక్తం అవుతు న్నాయి. ఆధార్ సేవలను వినియోగించుకునేందుకు వచ్చిన జనాలకు ప్రస్తుతం ఎస్పీఎంగా విధులు నిర్వహిస్తున్న వారే తమ పనులను వదులుకొని మరీ సేవలం దించాల్సిన పరిస్థితి తలెత్తిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తపాలా కార్యాల యంలో ఏర్పాటు చేసిన ఆధార్ సెంటర్‌కు ప్రత్యేకమైన గదిని సెంటర్ నిర్వహణ కోసం ఒక ప్రత్యేకమైన ఆపరేటర్‌ను నియమించాలని తపాలా శాఖ ఉద్యోగులతో పాటు ప్రజలు కోరుతున్నారు. పలుచోట్ల ఏర్పాటు చేసిన యూపీఎస్‌లు పని చేయక పోవడంతో కరెంటు పోయిన సమయంలో తపాలా కార్యాలయాల్లో కంప్యూటర్ల ద్వారా అందిస్తున్న సేవలకు అంతరాయం కలుగుతుందని పలువురు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికార యంత్రాంగం దృష్టి సారించి తపాలా శాఖలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.

భవనాల నిర్మాణానికి స్థలం కేటాయించాలి

: దిలీప్, ఐపీవో, భైంసా సబ్ డివిజన్



భైంసా సబ్ డివిజన్ పరిధిలో 9 సబ్ పోస్ట్ ఆఫీస్‌లున్నాయి. వీటిలో ముథోల్ సబ్ పోస్ట్ ఆఫీస్‌కు సొంత భవనం ఉంది. భైంసాలో సొంత భవన నిర్మాణానికి అనుకూలంగా స్థలం ఉంది. మిగతా చోట్ల కూడా స్థలం కేటాయిస్తే బాగుంటుంది.

తక్కువ అద్దెకు భవనాలు లభించడం లేదు

: సందీప్, ఐపీవో, నిర్మల్ సబ్ డివిజన్



నిర్మల్ సబ్ డివిజన్ పరిధిలో 10 తపాలా కార్యాలయాలు ఉన్నాయి. అందులో నాలుగింటికి సొంత భవనాలున్నాయి. మిగతా 6 కార్యాలయాలు నిర్వహిస్తున్న భవనాలకు అద్దె తక్కువగా చెల్లిస్తూ ఉండడంతో ఆశించిన స్థాయిలో కార్యాలయ భవనాలు దొరకడం లేదు. పోస్టల్ సూపరింటెండెంట్ పరిధిలో రూ.3 వేలకు మించి అద్దె చెల్లించడానికి లేదు. ఈ నిబంధన ఇబ్బందికరంగా మారింది.

ఏడాదిగా యూపీఎస్ లేక తపాలా సేవలకు అంతరాయం కలుగుతోంది

: పి.నవీన్, ఎస్పీఎం, ఖానాపూర్

ఖానాపూర్ తపాలా కార్యాలయంలో ఏడాది కాలంగా యూపీఎస్ లేక ఇబ్బందు లు పడుతున్నాం. కరెంటు లేని సమయంలో సేవలు నిలిచిపోతున్నాయి. ఒక్కో దశ లో చేసిన పనులన్నీ మళ్లీ మొదటికి వస్తున్నాయి. కార్యాలయంలో మూడు కంప్యూటర్లతో నిత్యం సేవలందిస్తున్నాం. ఈ సేవలు నిరంతరాయంగా కొనసాగాలంటే యూపీఎస్ కచ్చితంగా అవసరం ఉంది. ఆధార్ కేంద్రంలో సైతం ఆపరేటర్ లేకపోవడంతో తపాలా సేవలు నిర్వహిస్తున్న మా కార్యాలయ సిబ్బందితోనే నెట్టుకొస్తున్నాం. రెండుచోట్ల ఒకే వ్యక్తి విధులు నిర్వహించడం కష్టంగా మారింది.

జేఈపై చర్యలు తీసుకోవాలి

• లింగాపూర్ గ్రామస్థుల వినతి



వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్థులు

కడెం, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : కడెం మండలంలోని లింగాపూర్ గ్రామరైతుల పట్ల దురుసుగా ప్రవర్తిస్తున్నజేఈ విశాల్‌పై చర్యలు తీసుకోవాలని కడెం తహసీల్దార్ ప్రభాకర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం పలువురు రైతులు మాట్లాడుతూ.. లింగాపూర్ గ్రామ రైతుల పంటల సాగు కోసం నీటిని విడుదల చేయమంటే దురుసుగా ప్రవర్తిస్తున్నారని ఆరోపించారు. జేఈ విశాల్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రాజేందర్, రమేష్, సోమరెడ్డి, రంజిత్ పాల్గొన్నారు.

నగదు పట్టివేత



పట్టుకున్న నగదుతో పోలీసులు

కుబీర్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సిర్పెల్లి గ్రామ శివారులో గల చెక్‌పోస్టు వద్ద ఆదివారం తనిఖీ చేయగా రూ. 1,53,000 నగదు పట్టుబడినట్లు ఎస్సై రవీందర్ తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున నగదుకు సంబంధించి ఎలాంటి పత్రాలు లేక పోవడంతో డబ్బులు స్వాధీనం చేసుకున్నామన్నారు. సదరు వ్యక్తి హిమయత్‌నగర్‌కు చెందిన గాయక్వాడ్ శంకర్ అని తెలిపారు. హిమాయత్ నగర్ నుండి భైంసాకు డబ్బులు తీసుకు వెళ్తున్నట్లుగా తెలిపారు.

చెక్‌పోస్టు వద్ద ..

తానూర్ : ఎమ్మెల్సీ ఎన్నికలకోడ్ నేపథ్యంలో మండలంలోని బెల్‌తరోడా వద్ద నిర్వహిస్తున్న తనిఖీల్లో రూ. 3లక్షల నగదు పట్టుకున్నట్లు ఏఎస్సై శ్యాముల్ తెలిపారు. వివరాల ప్రకారం.. నిర్మల్‌కు చెందిన అమీర్‌ఖాన్ టీఎస్ 183279 అనే వాహనంలో మహారాష్ట్ర నుంచి వస్తుండగా తనిఖీ చేయగా నగదు లభించిందని, ఎలాంటి పత్రాలు లేకపోవడంతో స్వాధీనం చేసుకున్నామన్నారు.



పట్టుకున్న నగదుతో పోలీసులు

ముజ్గి మల్లన్న జాతరకు ఏర్పాట్లు

నిర్మల్ రూరల్, ఫిబ్రవరి 9 (ఆంధ్ర జ్యోతి) : జిల్లాతో పాటు మహారాష్ట్ర నుంచి భక్తులు హాజరయ్యే ముజ్గి మల్లన్న జాత రకు ఏర్పాట్లు ప్రారంభించారు. నిర్మల్‌రూరల్ మండలంలోని ముజ్గి గ్రామంలో మల్లన్న ఆలయంలో ఈ జాతర ప్రతి సంవత్సరం ఫిబ్రవరి నెలలో మాఘ మాస పౌర్ణమిన ఘనంగా పూజలు ఐదు రోజులు నిర్వహి స్తున్నారు. ఈ నెల 11వ తేదీ నాడు దేవుని కళ్యాణ మహోత్సవం, 12న చల్లనంబలి, 13న రథ మహోత్సవం, అన్నదానం, 14న నాగవెల్లి, 15వ తేదీన అగ్నిగుండం నిర్వహి స్తున్నట్లు ఆలయ పూజారులు, ముజ్గి మల్లన్న అన్నదాత కమిటీ సభ్యులు తెలి పారు. ఈ మేరకు రూరల్ సీఐ రామకృష్ణ, రూరల్ ఎస్సై లింబాద్రి, ఉత్సవాల ఏర్పాట్లను పరిశీలించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయా లని అధికారులు, నిర్వాహకులు సూచిం చారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న పోలీసులు

కబడ్డీ సబ్ జూనియర్ జిల్లా జట్టు ఎంపిక

కుంటాల, ఫిబ్రవరి, 9 : (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ జిల్లా కబడ్డీ అసోసి యేషన్ ఆధ్వర్యంలో ఈనెల 12 బుధవారం కుంటాల విజయ సాయి పాఠశాల మైదానంలో కబడ్డీ ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు నిర్మల్ జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు భూపతిరెడ్డి, కార్యదర్శి అనిల్ తెలిపారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు 16 సంవత్సరాలలోపు ఉండి బరువు 55 కేజీలలోపు ఉండాలని, ఈ పోటీల్లో గెలుపొందిన వారు వికా రాబాద్ జిల్లాలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని, ఎంపిక పోటీల్లో పాల్గొనే ఆసక్తి గల క్రీడాకారులు ఆధార్ కార్డుతో పాటు 100 రూపాయల ఎంట్రీ ఫీజు, పాస్‌ఫొటో తీసుకొని రావాలన్నారు.

పెంబిలో పూర్వవిద్యార్థుల అపూర్వ సమ్మేళనం

పెంబి, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : పెంబి మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1995- 1996 బ్యాచ్ పదోతరగతి చదివిన విద్యార్థులు ఆదివారం పెంబి మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల ఆవరణలో పూర్వ విద్యా ర్థుల సమ్మేళనం నిర్వహించారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులకు ఘనంగా స్వాగతం పలికి పూలమాల, శాలువాతో ఘనంగా సన్మానం చేశారు. 30 సంవత్సరాలకు కలిసిన మిత్రులు తమ చిన్ననాటి జ్ఞాపకా లను గుర్తుచేసుకున్నారు. కార్య క్రమంలో గురువులు శ్యామ్‌సుందర్ చారి, మురళీధర్, గంగారాం, సుదర్శన్, శ్రీనివాస్, బాలాజీ, ఖాజా, పూర్వ విద్యార్థులు తదితరులు ఉన్నారు.



ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

రోడ్డుప్రమాదంలో బాలుడి మృతి

భైంసా రూరల్, ఫిబ్రవరి 9 (ఆంధ్ర జ్యోతి) : మండలంలోని మాటేగాం టోల్ ప్లాజా ఆదివారం వానల్‌పాడ్ గ్రామానికి చెందిన బాలుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం కుభీర్ మండలం కుప్టి గ్రామానికి చెందిన జి. మల్లేష్ కొంతకాలం నుంచి వ్యవసాయ కూలీ పని చేస్తూ వానల్‌పాడ్‌లో కుటుంబంతో స్థిరపడి జీవనం కొనసాగిం చాడు. అతని కుమారుడు జి.అనిల్(13) కుంటాల మండలంలోని ఓ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. ఉదయం తండ్రి వ్యవసాయ పనికి వెళ్లగా కుమారుడు అనిల్ ఉదయం ద్విచక్ర వాహనంపై తండ్రి ర కోసం వెళ్తుండగా సెల్‌ఫోన్ మాట్లాడుతూ... డ్రైవింగ్ చేస్తూ అదుపు తప్పి పడి పోయా డు. ప్రమాదం జరిగి తలకు బలమైన గాయాలై మృతిచెందాడు. సమాచారం అం దుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరు కొని పోస్టుమార్టం నిమిత్తం భైంసా ఏరియా ఆసుపత్రికి తరలించారు. వివరాల గురించి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



మృతుడు అనిల్ (ఫైల్)

ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా కనకాపూర్‌లో రాస్తారోకో

లక్ష్మణచాంద, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా మండలంలోని కనకాపూర్ లో గల ప్రధాన చౌరస్తాలో మాల మహానాడు ఆధ్వ ర్యంలో ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఆది వారం రాస్తారోకో నిర్వహించింది. దీని వలన అరగం టపాటు వాహనాలు ఎక్కడికక్కడ స్తంభించిపో యాయి. ఈ సందర్భంగా వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి మండల అధ్యక్షుడు మెట్టు ప్రసాద్ మాట్లా డారు. ఎస్సీ వర్గీకరణ చేయటం సామాజిక న్యాయ సూత్రాలకు విరుద్ధమన్నారు. ఇప్పటికైనా సీఎం రేవంత్‌రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వం పునః సమీక్షించి తీర్మానాన్ని రద్దు చేసి యధావిధి ఎస్సీ రిజర్వేషన్‌ని కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో మండలంలో ని ఆయా గ్రామాలకు చెందిన మాలలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



రాస్తారోకో నిర్వహిస్తున్న వ్యతిరేక పోరాట సమితి

ప్రయోగ పరీక్షా కేంద్రాన్ని సందర్శించిన డీఐఈవో



పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న డీఈసీ మెంబర్

నిర్మల్ రూరల్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని దీక్ష జూనియర్ కళాశాల, ఎస్ఆర్ జూనియర్ కళాశాలలో జరుగుతున్న ఇంటర్ ప్రయోగ పరీక్షలను ఆదివారం రోజు జిల్లా ఇంటర్ విద్యాధికారి పరశురాం తనిఖీ చేశారు. డీఈసీ సభ్యులతో కలిసి ఇక్కడికి వచ్చిన జిల్లా ఇంటర్ విద్యాధికారి పరీక్షా కేంద్రాన్ని పరిశీలించారు. విద్యార్థులు ప్రాక్టికల్ చేసే విధానాన్ని పర్యవేక్షించారు. విద్యార్థుల రికార్డు పుస్తకాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డీఈసీ సభ్యులు రవి కిరణ్, సునీల్ కుమార్, కళాశాల ప్రిన్సిపాల్ సిహెచ్. వెంకట్ రెడ్డి, కరస్పాండెంట్ ప్రమోద్ రావు ఉన్నారు.

నృత్య కళాకారుల ప్రదర్శన



నృత్య ప్రదర్శనలో పాల్గొన్న జిల్లా నృత్య కళాకారులు

నిర్మల్ రూరల్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : భద్రాచలంలో భద్రాద్రి సాంస్కృతిక వారధి ఆధ్వర్యంలో భద్రాచల రామదాసు 392వ జయంతి ఉత్సవాల్లో పలువురు నిర్మల్ నృత్యకారుల కూచిపూడి నృత్య ప్రదర్శనలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ప్రదర్శనలో పట్టణంలోని స్వరూపిణి నృత్య కళాక్షేత్రం గురువు నవ్య వినయ్ ఆధ్వర్యంలో వారి శిష్య బృందం ముద్దుగారే యశోద, థిల్లానా, భామకలాపం, భరత వేదముగా, అంశాలను నృత్యకారిణిలు నృత్యంతో అలరించారు.

ఆర్టీఏ సభ్యుడికి నేతకాని కులస్థుల సన్మానం


దూట రాజేశేఖర్‌ను సన్మానిస్తున్న కుల పెద్దలు

ఉట్నూర్, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి):ఆదిలాబాద్ జిల్లా ఆర్టీఏ మెంబర్‌గా ఎన్నికైనటువంటి కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు దూట రాజేశ్వర్‌ని నేత కాని కుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సన్మానించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో నేతకాని జాతి నుంచి మాకులానికి దక్కిన గౌరవంగా భావిస్తూ కుల సంఘ సభ్యులందరు కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఆర్టీఏ సభ్యుడిగా ఎన్నికైన దూట రాజేశ్వర్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ విజయం కోసం శక్తివంచన పని చేసినందున ఖానాపూర్ ఎమ్మెల్యే వెడమబొజ్జుపటేల్ సహకారంతో ఈ అవకాశం లభించింది అన్నారు.ఈ కార్యక్రమంలో నేతకాని కులసంఘం సభ్యులు కొత్తపల్లి మ హేందర్, గొల్ల పల్లి నరసయ్య, ముంజం గంగేశ్వర్, జాడి రాజేశ్వర్,జాడి మల్లయ్య, చంద నగిరి విజయ్, బండి విజయ్, దర్శనగంగారాజు,కొత్తపల్లి రాజమల్లు, ముంజం భాస్కర్, బండి గంగులు, ముంజం గవాస్కర్, దుర్గం సుభాష్, దూట మహేందర్, సోగల ప్రవీణ్, దుర్గంరాజన్న, బొర్లకుంట రాజన్న, బండి మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా అధ్యక్షుడికి సన్మానం


బీజేపీ జిల్లా అధ్యక్షుడు బ్రహ్మానందంను సన్మానిస్తున్న అంకం అశోక్

భీంపూర్,ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి):బీజేపీ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడిగా రెండోసారి ఎన్నికైనపతంగే బ్రహ్మానందం, బీజేపీ రాష్ట్రకౌన్సిల్ సభ్య లుగా ఎన్నికైన భీంపూర్ మండలంకు చెందిన బీజేపీ సీనియర్‌నాయకుడు తాటిపెల్లి రాజులను ఆదివారం ఆదిలాబాద్ జిల్లా కార్యాలయంలో మం డల బీజేపీ అధ్యక్షుడు అంకం అశోక్, బీజేపీ సోషల్ మీడియా మండల అధ్యక్షు డు కామస్‌కార్ సంజీవ్‌లు నాయకులతో కలిసి శాలువాతో సన్మానించారు.

పాత కక్షలతో కారు ధ్వంసం

ఆదిలాబాద్‌రూరల్, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): పాత కక్ష కారణంగా కారును బండరాయితో ధ్వంసం చేసిన ఘటన ఆదిలాబాద్ టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. శనివారం ఆదిలాబాద్ పట్టణంలోని చిలుకూరి లక్ష్మీనగర్‌కు చెందిన షేక్ షైముద్ షైమద్‌కు చెందిన కారును అదే కాలనీకి చెందిన ఫారోఖీ ఖాన్ కారును ధ్వంసం చేశాడు. ఆదివారం షేక్ షైముద్ షైమద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై విష్ణు ప్రకాష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. కాగా పాత కక్షలు కారణంగానే కారును ధ్వంసం చేసినట్లు విచారణలో తేలింది.

పీఎం విశ్వకర్మ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

ఆదిలాబాద్, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): కులవృత్తులను ఆర్థికంగా బలో పేతం చేయడానికి కేంద్ర ప్రభుత్వం పీఎం విశ్వకర్మ పథకాన్ని తీసుకు వచ్చిందని, దీన్నిసద్వినియోగం చేసుకుంటు ఉపాధి రంగంలో రాణించాలని బీసీవెల్ఫేర్ అధికారి రాజలింగు అన్నారు. ఆదివారం ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజనలో ఏడు రోజుల శిక్షణ పూర్తి చేసుకున్న స్వర్ణకారులకు సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. రాంనగర్‌లో శిక్షణ కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని స్వర్ణకారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో శిక్షణ కేంద్రం ఇన్‌చార్జి శ్రీనివాస్ యాదవ్, సంఘం ప్రధాన కార్యదర్శి తిప్పర్తి సత్యం, శిక్షకులు ప్రశాంత్, రాజు పాల్గొన్నారు.

మంటల్లో ఇప్పపువ్వు గోదాం

● లక్షల మేర నష్టం


మంటల్లో దగ్ధం అవుతున్న ఇప్పపువ్వు


మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

ఉట్నూర్, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): గిరిజన సహకార సంస్థ ఆధ్వర్యంలోని ఇప్పపువ్వు గోదాంలో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. ఆదివారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు అనుహ్య రీతిలో గిరిజన సహకార సంస్థ (జీసీసీ) ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాలోని గిరిజనుల నుంచి సేకరించిన ఇప్పపువ్వును అధికారులు గోదాములుఓ నిలువ చేశారు. ఇప్పపువ్వుతో పాటు గన్నిబ్యాగ్స్ (ఖాళీ సంచులు) నిల్వ చేసిన గోదాముకు అనూహ్య రీతిలో మంటలు అంటుకోవడంతో ఇప్పపువ్వుతో పాటు, గన్నిబ్యాగ్స్ మంటల్లో బూడిదగా మారింది. సమాచారం తెలుసుకున్న ఉట్నూర్ అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకొని మంటలను ఆర్పే ప్రయత్నం చేస్తున్నప్పటికి మంటలు అదుపులోకి రావడం లేదు.ఈఅగ్ని ప్రమాదంలో రూ.లక్షలాది మేర ఇప్పపువ్వుతో పాటు గన్ని బ్యాగ్స్ అగ్నికి ఆహుతి అయ్యాయని గిరిజన సహకార సంస్థ అధికారుల ద్వారా తెలుస్తుంది. ఈ విషయమై జీసీసీ డివిజనల్ మేనేజర్ రామానందంను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా ఆ గోదాములో డ్యామేజ్ అయిన ఇప్పపువ్వు ఉందని, ఖాళీ సంచులే కాలిపోవడం వల్ల రూ.10లక్షల మేర ఆస్తి నష్టం జరిగి ఉండవచ్చని సమగ్ర దర్యాప్తు జరిపిస్తే అసలు మంటలు ఎలా అంటుకున్నాయో తెలుస్తుందని అన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఆవు మృతి


రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఆవు

తలమడుగు రూరల్, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని సుంకిడి గ్రామ సమీపంలోని స్టోన్ క్రషర్ల వద్ద ఆదివారం అతి వేగంతో వస్తున్న లారీ ఢీకొని సుంకిడి గ్రామానికి చెందిన విఠల్ రైతుకు సంబంధించిన ఆవుకు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందిందని బాధిత రైతు తెలిపారు. ఆవు విలువ దాదాపు 30 వేల వరకు ఉంటుందన్నారు. కాగా వెంటనే రైతు గ్రామస్తులకు సమాచారం అందించడంతో అతివేగంతో వస్తున్న లారీని గ్రామస్తులు గ్రామ సమీపం వద్ద ఆపి బాధిత రైతుకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. బాధిత రైతుకు ఆర్థిక సాయం అందిస్తానని లారీ సిబ్బంది తెలిపారు. కాగా ఈ సంఘటన స్థలానికి ఎస్సై అంజమ్మ చేరుకుని అతి వేగంతో వాహనాలు నడపవద్దని ప్రతీఒక్కరు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. చట్టపరమైన చర్యలు తీసుకుంటా మని హెచ్చరించారు.


క్యాబిన్‌లో ఇరుక్కుపోయిన డ్రైవర్

● రోడ్డు ప్రమాదం.. క్యాబిన్‌లో ఇరుక్కుపోయిన డ్రైవర్

ఆదిలాబాద్: చాందా సమీపంలోని జాతీయరహదారిపై ఆదివారం తెల్లవారుజామున రోడ్డుప్రమాదం జరిగింది.ఎదురుగా వెళ్తున్న వాహనం ఢీకొనడంతో లారీ డ్రైవర్ క్యాబిన్‌లో ఇరుక్కుపోయి తీవ్రంగా గాయపడినట్లు స్థానికులు తెలిపారు. క్షతగాత్రుడు మహారాష్ట్రలోని కిన్వట్ తాలుకాకు చెందిన కైలాష్ గుర్తించారు. సమాచారం అందుకున్న 108 సిబ్బంది ఘటనా స్థలానికి వచ్చి డ్రైవర్‌ను బయటకు తీసి ఈఎంటీ కార్తీక్ సింగ్, పైలట్ పాండురంగ్, ఈఆర్‌సీపీ డాక్టర్ మనీష్, రిమ్స్‌కు తరలించారు.

ప్రతీ ఒక్కరు భక్తి మార్గంలో నడవాలి

● ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్‌రెడ్డి సతీమణి


నిరాలలో బాజీరావ్ బాబాకు పూజలు నిర్వహిస్తున్న సాయి మౌనరెడ్డి

జైనథ్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): సమాజంలోని ప్రతీ ఒక్కరు చేడు వ్యసనాలను వీడి సద్గురు బాజీరావ్ బాబా చూపిన భక్తి మార్గంలో నడవాలని కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్‌రెడ్డి సతీమణి సాయి మౌన రెడ్డి అన్నారు. మండలంలోని నిరాల గ్రామంలో వారం రోజుల నుండి జరుగుతున్న బాజీరావ్ బాబా సప్తాహ ముగింపు కార్యక్రమానికి ఆదివారం హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా బాజీరావ్ బాబా చిత్రపటానికి ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రజలు పాడి పంటలతో చల్లంగా ఉండాలని వేడుకున్నారు. ఈ సందర్భంగా గ్రామంలో పెద్ద ఎత్తున అన్నదానాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గిమ్మ సంతోష్, మహిళ నాయకురాలు శ్రీలేఖ, నాయకులు దేశెట్టి ప్రభావతి, నిరాల గ్రామస్థులు, మహిళలు పాల్గొన్నారు.

అభివృద్ధికి ఆమడదూరంలో..!!

(5వ పేజీ తరువాయి...)

ఖర్చు చేసి 519 ఇళ్ల నిర్మాణం పూర్తి చేయగలిగారు. మరో 403 ఇళ్ల నిర్మాణ దశలో ఉండగా.. 78 ఇళ్ల నిర్మాణ పనులు వివిధ అనివార్య కారణాల వల్ల నిలిచి పోయాయి.

కొత్తగా 6,039 ఇళ్లు మంజూరు

2023లో మంజూరు చేసిన వెయ్యి ఇళ్లకు కేంద్ర ప్రభుత్వం పూర్తి నిధులు విడుదల చేయక ముందే, ప్రధానమంత్రి జన్‌మన్ యోజన ద్వారా మరో 6,039 గృహాలను మంజూరు చేస్తున్నట్లు ప్రకటించింది. ఈ గృహ నిర్మాణ పనులను జిల్లా కేంద్రంలోని గృహ నిర్మాణ శాఖకు అప్పగించింది. గృహ నిర్మాణ శాఖ అధికారుల ఆధ్వర్యంలో ఇళ్లు లేని తోటి, కోలాం గిరిజనుల లబ్ధిదారులను గుర్తించడం జరుగుతుందని ఐటీడీఏ అధికారులు పేర్కొంటున్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


ఉట్నూర్ పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనానికి హాజరైన పూర్వ విద్యార్థులు

ఉట్నూర్, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): 33 ఏళ్ల క్రితం కలసి మెలిసి ఉట్నూర్ జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం ఉట్నూర్ మండలం కేంద్రంలోని తాము చదువుకున్న పాఠశాలలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. 1991-92 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న 67 మంది పూర్వ ఇద్యార్థులు ఒక వద్దకు చేరుకొని తమ యోగక్షేమాలు ఒకరినొకరు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులకు పాఠశాలు చెప్పిన పంతుళ్లను ఘనంగా సన్మానించారు. హైదరాబాద్, నిజామాబాద్, వరంగల్, కరీంనగర్, ఆదిలాబాద్ నిర్మల్ ప్రాంతాలలో ఉంటున్న పూర్వ విద్యార్థులందరు వచ్చి పూర్వ పంతులను సన్మానించడం హర్షనీయమని పూర్వ టీచర్లు కొనియాడారు.

సిమెంట్ బస్తాలు పక్కదారి

బోథ్, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో అభివృద్ధి పనుల కోసం ప్రభుత్వపరంగా సరఫరా అవుతున్న సిమెంటు పక్కదారి పడుతుందన్న ఆరోపణలు వస్తున్నాయి. బోథ్ మండలంలో చెక్ డాం నిర్మాణం కోసం ప్రభుత్వ పరంగా సరఫరా అయిన సిమెంట్‌కు పక్కదారిన విక్రయిస్తున్నట్లు తెలిసింది. చెక్ డాం పనులకు వాడాల్సిన సిమెంటును నేరడిగొండ మండలంలోని ఓ సిమెంట్ దుకాణంలో తక్కువ ధరకు గ్రామాలలో విక్రయిస్తున్నట్లు సమాచారం. వాస్తవానికి సబ్సిడీపై వచ్చిన సిమెంటు నిర్మాణ స్థలాలకు చేరుకోకుండా అడ్డదారుల్లో వ్యాపారుల వద్దకు చేరుతుందని అంటున్నారు.బోథ్ మండలంలోని కొన్ని గ్రామాలకు మహారాష్ట్ర నుండి గుట్టుచప్పుడు కాకుండా సిమెంటు స్టీల్ విక్రయాలు జరుగుతున్నాయని ఆరోపణలు వస్తున్నాయి. జిల్లా అధికారులు అక్రమ వ్యాపారంపై దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య

మావల, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ఉరేసుకొని యువకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన చోటు చేసుకుంది. మావల ఎస్సై విష్ణువర్ధన్ తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని బాలాజీ నగర్‌కు చెందిన చింతల గణేష్ (25) కూలి పని చేస్తుంటాడు. గత మూడు సంవత్సరాల క్రితం పెళ్లి జరిగి విడాకులు తీసుకున్నారు. అప్పటి నుండి తల్లి వద్ద ఉంటున్నాడు. ఈ క్రమంలో మద్యానికి అలవాటు పడ్డాడు. ఎప్పటిలాగే మద్యం త్రాగడానికి డబ్బులు కావాలని తల్లి గొడవ పడ్డాడు. దీంతో తల్లి తన కూతురి ఇంటికి వెళ్ళిపోయిం ది. ఇంట్లో ఎవరు లేని సమయంలో శనివారం రాత్రి గణేష్ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఐక్యతతోనే మున్నూరుకాపుల అభివృద్ధి

● మున్నూరు కాపు మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు మణికొండ వెంకటేశ్వర్లు


రైతు నాగలి విగ్రహానికి పూలమాల వేస్తున్న రాష్ట్ర మున్నూర కాపు మహాసభ నాయకులు


గుర్తింపు పత్రాన్ని సంఘం అధ్యక్షుడు అందజేస్తున్న రాష్ట్ర నాయకులు

ఖానాపూర్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో ఐక్యతతోనే మున్నూరు కాపుల అబివృద్ధి సాధ్యమవుతుందని తెలంగాణ రాష్ట్ర మున్నూరు కాపు మహాసభ అధ్యక్షులు మణికొండ వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం ఖానాపూర్‌లోని తిమ్మాపూర్ మున్నూరు కాపు సంఘంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఖానాపూర్ వేదికగా రైతు నాగలి విగ్రహావిష్కరణ చేసిన తిమ్మాపూర్ సంఘాన్ని ఆయన అభినందించారు. అనంతరం రైతు నాగలి విగ్రహాన్ని పరిశీలించారు. తెలంగాణ రాష్ట్ర మున్నూరు కాపు మహాసభ కాచిగూడ అనుబంధ సంఘంగా తిమ్మాపూర్ మున్నూరు కాపు సంఘాన్ని గుర్తిస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం గుర్తింపు పత్రాన్ని తిమ్మాపూర్ మున్నూరు కాపు సంఘం అధ్యక్షులు నిమ్మల రమేష్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మున్నూరు కాపు మహాసభ ముఖ్య నాయకులు కొండూరు వినోద్, కందికట్ల భాస్కర్, సిహెచ్. హరిప్రసాద్,కంచుకట్ల ప్రకాష్, ఖానాపూర్ సంఘం అధ్యక్ష కార్యదర్శులు నరేందర్, నాయిని సంతోష్, తిమ్మాపూర్ సంఘం ప్రధాన కార్యదర్శి బీసీ రమేష్, సిరిపురం నాగరాజు, కడకుంట్ల రవి, కోమటిపల్లి రాజేశ్వర్, కొట్ల మహేష్, గోడపురం సందీప్, బీర్కుల రాజేందర్, బీసీ రాజన్న, ఆకుల శ్రీనివాస్, ఇస్తారి రాములు, తోట సత్యం, సంద పోశెట్టి, పాదం రాజనన్న, ఎడ్ల రాజేందర్, కోమటిపల్లి భీమన్న, శంకర్, తదితరులున్నారు.

ఘనంగా పీఆర్‌టీయూ ఆవిర్భావ వేడుకలు

భైంసా, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పీఆర్‌టీయూ భవన్‌లో ఆదివారం ఆ యూనియన్ అవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బీవీ రమణరావ్ నేతృత్వంలో జరిగిన అవిర్భావ దినోత్సవ వేడుకల్లో పీఆర్‌టీయూ భైంసా డివిజన్ పరిధిలోని ఆయా మండలాల కార్యవర్గ ప్రతినిధులు, రాష్ట్ర, జిల్లా ప్రతినిధులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. వేడుకల్లో భాగంగా పీఆర్‌టీయూ వ్యవస్థాపకులు స్వర్గీయ సామల యాదగిరి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి బీవీ రమణరావ్ యూనియన్ జెండాను ఎగురవేసారు. వివిధ స్థాయి బాధ్యులుగా యూనియన్ బలోపేతానికి విశిష్ట సేవలు అందించి పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయులు కె.పోతన్న, ఎం.చంద్రశేఖర్, వాహబ్, ఎం.సుజాతలను ఘనంగా సన్మానించి జ్ఞాపికలను బహుకరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బీవీ రమణరావ్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కారానికి యూనియన్ బాధ్యతాయుతతో పనిచేస్తోందన్నారు. ఇదే క్రమంలో ఉపాధ్యాయుల సంక్షేమానికి చిత్తశుద్ధితో పాటుపడుతోందన్నారు. రానున్న రోజుల్లో సీపీఎస్ రద్దుతో పాటు నూతన పీఆర్సీ , పెండింగ్ బిల్లుల చెల్లింపులు, ఏకీకృత సర్వీసును సాధించేందుకు యూనియన్ నాయకత్వం ప్రణాళికబద్ధంగా కృషి చేస్తోందన్నారు. ఉపాధ్యాయ లోకానికి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయని పక్షంలో యూనియన్ ఆధ్వర్యంలో రాజీలేని రీతిలో పోరుబాట చేపడుతామని వెల్లడించారు. ఇందులో భైంసా, తానూర్ మండలాల విద్యాధికారులు ఎ.సుభాష్, బాశెట్టి నరేందర్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు శివరామ్, జి.పుండలీక్, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్, మల్లికార్జున్, జిల్లా అసోసియేట్ అధ్యక్షులు సీహెచ్ వందన, జిల్లా ఉపాధ్యక్షులు ఎ.గోపాల్, భైంసా మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్. గంగాధర్, ఎన్. కృష్ణలతో పాటు డివిజన్ పరిధిలోని ఆయా మండలాల బాధ్యులు, సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


మాట్లాడుతున్న పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు

ఉపాధ్యాయుల సమస్య పరిష్కారం పీఆర్‌టీయూతోనే సాధ్యం

- జిల్లా అధ్యక్షుడు నరేంద్రబాబు

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం పీఆర్‌టీయూ సంఘంతోనే సాధ్యమని ఆ యూనియన్ జిల్లా అధ్యక్షుడు నరేంద్ర బాబు అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రమైన నిర్మల్‌లోని పీఆర్‌టీయూ భవనంలో యూనియన్ ఆవిర్భావ వేడుకలను పురస్కరించుకొని ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. పంచాయతీ రాజ్ ఉపాధ్యాయుల సంక్షేమమే ప్రధాన ఎజెండాగా 1971లో సంఘం ఆవిర్భవించిందని గుర్తు చేశారు. ఇందులో యూనియన్ ప్రతినిధులు బి. గజ్జారాం, కే. మోహన్, పరమేశ్వర్ రెడ్డి,సిద్ధిరామ్, విజయ్ కుమార్, సదానందం, కే. శంకర్, భూమారెడ్డి, కృష్ణ, శేఖర్, రఘునాథ్, పరమేశ్వర్, రాజన్న, చింత మోహన్, రాజన్న, గంగాచరణ్‌లు పాల్గొన్నారు.

లక్ష్మణచాంద పీఏసీఎస్ సర్వసభ్య సమావేశం

లక్ష్మణచాంద, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పీఏసీఎస్ కార్యాలయంలో పీఏసీఎస్ చైర్మన్, డీసీసీబీ ఉమ్మడి జిల్లా వైస్ చైర్మన్ ఎర్ర రఘునందన్ అధ్యక్షతన ఆదివారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎజెండా అంశాల వారీగా సమావేశం కొనసాగింది. ఈ సందర్భంగా రఘునందన్ రెడ్డి మాట్లాడుతూ... రైతులకు విత్తనాలు, ఎరువులను సబ్సిడీ ధరకు అందజేస్తున్నామని, కొరత రాకుండా చూస్తున్నామని సకాలంలో రుణ సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కోండ్ర నరేష్ రెడ్డి, జడ్పీటీసీ సభ్యులు ఓస రాజేశ్వర్, మాజీ సర్పంచ్ బిట్లింగ్ నారాయణ, రాజు, రైతుల సహకార సంఘ సభ్యులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇరువురికి గాయాలు

కుభీర్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని తెలంగాణ తల్లి చౌరస్తా వద్ద ఆదివారం గుర్తు తెలియని వాహనం ఢీ కొని ఇద్దరికి తీవ్ర గాయాలు అయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం టీఎస్ 18 హెచ్ 3896 అనే నెంబరు గల ద్విచక్రవాహనంపై వస్తున్న లింగేశ్వర్(45) పార్డి(బి) గ్రామం, సంతోష్ (40) నందపహాడ్ గ్రామం. వీరిద్దరు పార్డి(బి) నుండి వస్తుండగా తెలంగాణ చౌరస్తా వద్ద అతివేగంగా కుభీర్ నుండి భైంసా వైపుకు వెళ్తున్న గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టింది. దీంతో స్థానికులు అక్కడికి వచ్చే సరికి ఆ వాహనం ఆపకుండా అతివేగంగా వెళ్లినట్లు వారు తెలిపారు. క్షతగాత్రులను ప్రత్యేక వాహనంలో భైంసా ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు.

విద్యుదాఘాతంతో ఇద్దరికి గాయాలు

మామడ, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మామడ సబ్ స్టేషన్‌లో పని చేసే సిబ్బంది మామడ జేఎల్ఎం అనిల్, నారాయణ మరమ్మతులు చేస్తున్న క్రమంలో మరమ్మతులు చేసే కరెంటు తీగలపై కొమ్మ విరిగి కరెంటు ఉన్న తీగలు అర్త్ కావడంతో ప్రమాదం జరిగినట్లు మామడ ఏఈ బాలయ్య తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం 11 కేవీ వైర్ మరమ్మతులు చేస్తున్న క్రమంలో చెట్టు కొమ్మ విరిగి పడడంతో వేరే లైన్ చేస్తున్న లైన్ కలిసిపోవడంతో ప్రమాదవశాత్తు షార్ట్ సర్క్యూట్ జరిగినట్లు ఆయన తెలిపారు. వెంటనే ప్రథమ చికిత్స నిమిత్తం మామడ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా ఆసుపత్రి సిబ్బంది అక్కడ లేకపోవడంతో నిర్మల్ జిల్లా ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించినట్లు వారు తెలిపారు.

మార్కండేయ పద్మశాలి సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

నిర్మల్ చైన్‌గేట్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ జిల్లా కేంద్రంలోని ప్రియదర్శిని నగర్ శ్రీ మార్కండేయ పద్మశాలి సంఘం ఉత్తర విభాగం కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక నందన డిగ్రీ కాలేజీ ఆవరణలో జరిగిన ఎన్నికలను పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షుడు చిలుక రమణ, ప్రధాన కార్యదర్శి అల్లం అశభోక్, పోపా జిల్లా ప్రధాన కార్యదర్శి బొద్దుల రమణ, పద్మశాలి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు జల్లా రమణ పర్యవేక్షణలో జరిగాయి. అధ్యక్షుడిగా గురుడ శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా నరిమెట్ల జగదీష్ (చిట్టి), నరిమెట్ల సాయికిరణ్, ప్రధాన కార్యదర్శి మాన్పురి లక్ష్మణ్, కోశాధికారిగా ఓం ప్రకాష్, సెక్రటరీగా అవధూత్ భూమేష్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా సగ్గం హరిచరణ్, ఆడిటర్‌గా మైసర్ల సతీష్, గౌరవ సలహా సభ్యులుగా తాళ్ల కిషన్ (రాకేష్), గర్దాస్ చక్రధర్, రేగుంట నరేందర్, బైండ్ల భూమేష్, మద్దెర్ల భోజన్న, ఆడెపు సుభాష్‌లు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు చిలుక రమణ మాట్లాడుతూ... పద్మశాలి కుల సంఘ అభివృద్ధికి ప్రతి సభ్యుడు కృషి చేయాలన్నారు. ఐకమత్యంతోనే సమస్యలను పరిష్కరించుకునే అవకాశం ఉంటుందన్నారు. సంఘ భవనాల నిర్మాణానికి హనుమంతు సహకారం అందజేస్తానన్నారు. సంఘ సభ్యులందరికీ అండగా నిలుస్తామన్నారు. నూతనంగా ఎన్నికైన సంఘ బాధ్యులు అంతా కలిసికట్టుగా ముందుకు సాగి ఆదర్శంగా నిలవాలన్నారు.


ప్రియదర్శినినగర్ ఎన్నికైన ఉత్తర విభాగ కార్యవర్గం ఇదే..

ట్రంప్ దురహంకార చర్యని ఖండిద్దాం

● సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ పార్టీ జిల్లా కార్యదర్శి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి

నిర్మల్ రూరల్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : భారతీయులకు బేడీలు వేసి పంపిస్తున్న ట్రంప్ దురహంకార చర్యలను ప్రతి ఒక్కరూ ఖండించాల్సిన అవసరం ఎంతైనా ఉందని సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ పార్టీ జిల్లా కార్యదర్శి కే. రాజన్న పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని భగత్ సింగ్ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ... అమెరికా అధ్యక్షుడు దురహంకారంతో చేస్తున్న అకృత్యాలను ప్రధాని మోదీ ఖండించకపోవడం శోచనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా కార్యదర్శి నంది రామయ్య, జిల్లా నాయకులు ఎం. బక్కన్న, ఎస్. గంగన్న, ఎండీ గఫూర్, తదితరులు పాల్గొన్నారు.

ఢిల్లీలో బీజేపీ విజయం కాల్వలో సంబురాలు

దిలావర్‌పూర్,ఫిబ్రవరి 9(ఆంధ్ర జ్యోతి) : ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ అఖండ విజయం సాధించడంతో దిలావర్ పూర్ మండలం కాల్వ గ్రామంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు టపాసులు కాల్చి మిఠాయిలు పంచి సంబురాలు చేసుకు న్నారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షులు అయిండ్ల నర్సారెడ్డి మాట్లాడుతూ... ప్రజాధనాన్ని దోచుకునే వారిని క్షమించబోమని ప్రజలు స్పష్టమైన తీర్పునిచ్చార న్నారు. అవినీతి, అబద్ధాలకు ఢిల్లీ ప్రజలు గుణ పాఠం చెప్పారన్నారు. ఈ కార్యక్రమం లో నాయకులు మాజీ సర్పంచ్ లక్ష్మణ్, మాజీ ఎంపీటీసీ సభ్యులు రమణ, మాజీ ఉప సర్పంచ్ లక్ష్మణ్, మాజీ వార్డు సభ్యులు గట్టుస్వామి, ఆమెడ శ్రీకాంత్‌రెడ్డి, నరేష్ రెడ్డి, బి. నర్సారెడ్డి, నల్ల రాజు, మంద సాయేందర్, ప్రధాన కార్య దర్శి నల్ల నరేష్ రెడ్డి, కడ్తాల్ నర్సయ్య, నవీన్,నరేష్, అనిల్, గంగాధర్,నారాయణ,పాల్గొన్నారు.

బీజేపీ మండల అధ్యక్షుడికి సన్మానం

నర్సాపూర్(జి), ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ నర్సాపూర్ మండల అధ్య క్షుడిగా ఎన్నికైన బర్కుంట నరేందర్‌ను గ్రామ బీజేపీ నాయకులు, కార్యకర్తలు సన్మానించారు. ఈ సందర్భంగా నరేందర్ మాట్లాడుతూ... తనను నమ్మి బాధ్యత ఇచ్చిన స్థానిక ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డికి, జిల్లా పార్టీ నాయకులకు కృతజ్ఞతలు చెప్పారు. మండలంలో పార్టీ ఎదుగుదలకు తనవంతు కృషి చేస్తానని, రాబోయే స్థానిక ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం అందరినీ కలుపుకొని అత్యధిక స్థానాలు గెలవడానికి అందరూ సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజేందర్, దత్తురాం, లక్ష్మణ్, సుధాకర్, నవీన్, రాజు, విజయ్, చిట్టి, ప్రణయ్, రాము, హన్మాండ్లు, పవన్‌లు పాల్గొన్నారు.

ఘనంగా భీమన్న గదల ఊరేగింపు


భీమన్న గదలను ఊరేగింపు నిర్వహిస్తున్న దృశ్యం

లక్ష్మణచాంద,ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మండలం లోని వడ్యాల్ గ్రామంలో భీమన్న గదల ఊరేగిం పును ఆదివారం ఘనంగా నిర్వహించారు. భీమన్న గదలను పవిత్ర గంగా నది (దక్షిణ భారత గంగాన దిగా పిలువబడే గోదావరి నది) జలాభిషేకం చేయించి సోమవారం భీమన్న పండుగను అంగరంగ వైభవంగా జరుపుతారు.ఈఊరేగింపు కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

స్థానిక పోరుకు సన్నద్ధం

● పల్లెల్లో మొదలైన స్థానిక సందడి

● జనాలు గుమిగూడిన చోట్ల 'స్థానిక' ముచ్చట్లు

ముథోల్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : పల్లెల్లో స్థానిక సంస్థల ఎన్నికల సందడి కనిపిస్తోంది. త్వరలోనే స్థానిక సమరం ఉంటుందని ప్రభుత్వం స్పష్టం చేసిన నేపథ్యంలో అధికారిక ప్రకటన కోసం గ్రామ రాజకీయ నేతలు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. అదే సమయంలో స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ ప్రక్రియ ఎలా ఉండబోతోందన్న దానిపై సర్వత్రా ఆసక్తి, ఉత్కంఠ నెలకొని ఉంది. అయితే స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల సంఘం ఏర్పాట్లను ముమ్మరం చేస్తున్న నేపథ్యంలో రోజు రోజుకు గ్రామంలో రాజకీయ వేడి రాజుకుంటోంది. రిజర్వేషన్ల కోసం



ముథోల్ మండల మ్యాప్

ఇటీవల కుల గణణ సర్వే చేయడంతో ఆశావాహుల్లో కొంత గుడులు నెలకొంది. రిజర్వేషన్ ఏది వస్తుందో అంచనా వేయలేక అయోమయానికి గురవుతున్నారు. అధికార కాంగ్రెస్ పార్టీలో ఆశావాహుల సంఖ్య అధికంగానే ఉంది. ప్రతిపక్ష పార్టీలైన బీఆర్ఎస్, బీజేపీ నుంచి కూడా సర్పంచ్ స్థానానికి పోటీ చేసి తమ సత్తా చాటేందుకు నాయకులు సన్నద్ధమవుతున్నారు.

ఏర్పాట్లు ముమ్మరం...!

రాష్ట్ర ఎన్నికల సంఘం ఇప్పటికే వార్డుల విభజన, పోలింగ్ స్టేషన్ల ఏర్పాటు తదితర వాటి ఏర్పాట్లకు చర్యలు చేస్తున్న విషయం తెలిసిందే. ముథోల్ మండలంలో 19 గ్రామ పంచాయతీలకు గాను 34,905 ఓటర్లున్నారు. ఇందులో 17,045 మహిళా ఓటర్లు, 17,860 పురుషులు న్నారు. 166 వార్డు స్థానాలకు 19 స్థానాలకు, 19 సర్పంచ్ స్థానాలకు ఎన్నికలు నిర్వహించేందుకు అధికార యంత్రం ఏర్పాట్లు చేస్తోంది. ఇప్పటికే క్లస్టర్ల వారీగా ఆర్వోలు, ఏఆర్వోలను నియమించినట్లు సంబంధిత అధికారులు తెలుపుతున్నారు.

సమరానికి సై అంటూ.. మాట మంతి

స్థానిక సంమరానికి వడివడిగా అడుగులు పడుతున్నాయని చెప్పుకోవచ్చు. ఈ నెల 15 వరకు లేదా ఈ నెల చివరి వరకు ఎన్నికల నోటిఫికేషన్, మార్చి మాసంలో ఎన్నికలు నిర్వహించేందుకు ఎన్నికల సంఘం సన్నాహలు చేస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో గ్రామాల్లో నోటిఫికేషన్ ఎప్పుడు వచ్చినా తాము పోటీకి సిద్ధమంటూ అధికార పార్టీతో పాటు ప్రతిపక్ష పార్టీల నుంచి మాజీ సర్పంచ్‌లు, వార్డు మెబర్లు, యువకులు, యువ నాయకులు తదితరులు బరిలో ఉంటామన్న వాదనలు ఇప్పటి నుంచి వినబడుతున్నాయి. గ్రామాల్లో ఎక్కడ గుమిగూడిన సర్పంచ్‌ల ఎన్నికల గురించి మాటలు వినబడుతున్నాయి. ప్రజల మద్దతు కూడా


ముథోల్ గ్రామ పంచాయతీ కార్యాలయం

గట్టుకునేందుకు పలువురు మాటా మంతి చేస్తూ ఉన్నారు. స్థానిక సమరంలో తమ అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు రాజకీయ వారసులతో పాటు గతంలో ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉన్నవారు, రాజకీయాల్లోకి రాని వారు, వచ్చినవారు, యువకులు సర్పంచ్‌లకు, వార్డు మెంబర్లకు, ఎంపీటీసీలకు పోటీ చేస్తామన్న ప్రచారం హుషారుగా వినబడుతుంది. ఈ సారి తాము బరిలో ఉంటామని తమ ఆశీర్వాదం కావాలని పెద్ద మనుషులకు అడగడం మొదలైంది. మొన్నటి నుండి పది మంది ఒక దగ్గర కలిస్తే చాలా స్థానిక ఎన్నికలకు సంబంధించిన ముచ్చట్లు వినబడుతున్నాయి. రిజర్వేషన్లు కలిసి వస్తే తమకే పట్టం కట్టాలని తాము ఎలాగైనా బరిలో ఉంటామని కొందరు, మరికొందరు నోటిఫికేషన్ ప్రకటించిన తర్వాత అనుకూలమైన వాతావరణం కలిసి వస్తే కచ్చితంగా బరిలో ఉంటామని మరి కొందరు ముచ్చటించుకుంటున్నారు. ఇంకొందరు ఎన్నికలు ఎప్పుడు వచ్చిన సిద్ధమే అన్న దృఢ నిశ్చయంతో నిత్యం ప్రజలలో తిరుగుతున్నారు. గ్రామాల్లో శుభ, అశుభ కార్యాక్రమాల్లో పాల్గొంటున్నారు. అంతేకాకుండా పల్లెల్లో పది మంది ఉంటే చాలు దగ్గరికి వచ్చి కాకా, తమ్ముడు అంటూ వరుసలు పెట్టి మాట్లాడడం మొదలుపెట్టారు. ఏదేమైనా ఈ స్థానిక సమరం రసవత్తరంగా జరుగుతుందని చెప్పుకోవచ్చు.


సోనాల మండలం సమీపంలో ఉన్న పురాతన శివాలయం

పురాతన శివాలయం అభివృద్ధికి దాతల చేయూత

బోథ్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): సోనాల మండల కేంద్రంలోని పంట చేలలో వెలసిన పురాతన శివాలయం అభివృద్ధికి గ్రామస్థులు కంకణం కట్టారు. గ్రామంలో రామాలయం అభివృద్ధికి సహకరించిన విధంగానే పంట చేలలో వెలసిన శివాలయం అభివృద్ధికి చర్యలు చేపట్టారు. ప్రతీ ఏడాది శివరాత్రికి ఆలయంలో భక్తులు పూజా కార్యక్రమాలను నిర్వహిస్తుంటారు. అయితే అతి పురాతనమైన ఈ ఆలయ అభివృద్ధికి గ్రామానికి చెందిన చిలుకూరి నరేందర్ అనే భక్తుడు చర్యలు చేపట్టారు. గ్రామంలోని ఉద్యోగులను, వ్యాపారులను ఆలయ అభివృద్ధి కోసం సహకరించాలని కోరడంతో చందాలు ఇచ్చేందుకు సైతం గ్రామ ప్రజలు ముందుకు వస్తున్నారు. మండలంలో శివాలయం ఎక్కడ లేకపోవడంతో పురాతన శివాలయాన్ని అభివృద్ధి చేసేందుకు ముందుకు రావడం జరిగింది

● పురాతన ఆలయం ఇది

గ్రామానికి రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న పంట పొలాల్లో ఉన్న శివ ఆలయం పురాతనమైనదిగా గ్రామస్థులు పేర్కొంటున్నారు. గత పది సంవత్సరాల క్రితం ఆలయం ఉన్న ఎప్పుడో ఒకసారి భక్తులు వెళ్లి పూజా కార్యక్రమాలను నిర్వహించి వచ్చేవారు. అయితే క్రమక్రమంగా ఆలయాన్ని గ్రామస్థులు వెలుగులోకి తీసుకురావడంతో అభివృద్ధి చేసేందుకు దృష్టి సారిస్తున్నారు. పురాతన ఆలయంలో అభివృద్ధి చేసినట్లయితే మండల ప్రజలకు శివాలయం పూజలు చేసేందుకు అందుబాటులో ఉంటుందని అంటున్నారు.

● రెండేళ్లుగా ఆలయం అభివృద్ధికి కృషి

గ్రామం సమీపంలో ఉన్న ఈ ఆలయానికి కనీసం రోడ్డు వసతి లేకపోవడంతో గ్రామానికి చెందిన భక్తులు గ్రామ పెద్దలు తాత్కాలిక రోడ్డు వేయించారు. అంతేగాక శివాలయానికి చిన్న ప్రహరీ నిర్మించడంతో పాటు రేకులతో గుడి నిర్మాణం జరిగింది. దీంతో క్రమక్రమంగా ఆలయం అభివృద్ధి కావడంతో ఈ ఏడాది శివరాత్రి వరకు ఆలయాన్ని మరింత అభివృద్ధి చేయాలని గ్రామ పెద్దలు ముందుకు వస్తుండటంతో శివాలయం ఈ ఏడాది భక్తులతో నిండిపోయే ఆస్కారం ఉంది.


గజ్జలమ్మ ఆలయ వార్షికోత్సవంలో హోమంలో పాల్గొన్న భక్తులు

గజ్జలమ్మ ఆలయ వార్షికోత్సవాలు ప్రారంభం

కుంటాల, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం కుంటాల భక్తుల ఇలవేల్పు గజ్జలమ్మ ఆలయ 5వ వార్షికోత్సవ ఉత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. నేటి నుంచి మంగళవారం వరకు జరగనున్న ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం భగవతి ప్రార్థన, విశేష సంకల్పం, మహా గణపతి పూజ, పుణ్యాహవచనం, యాగశాల ప్రవేశము, సం స్కారం, వాస్తు, క్షేత్ర పాలక, నవగ్రహ యోగిని, కర్కరి, సర్వతోభద్ర మండల స్థాపన, అగ్ని ప్రతిష్ఠ, స్థాపిత దేవతా హోమం కార్యక్రమాలు స్థానిక వేద పండితులు చంద్రశేఖర శర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. మ ధ్యాహ్నం వ్రత, జలాభిషేకము, సాయంత్రం కుంకుమార్చన, హారతి, మం త్రపుష్పం, తీర్థ ప్రసాద వితరణ కార్యక్రమం చేపట్టారు. ఆదివారం నిర్వ హించిన కార్యక్రమాలకు గ్రామస్థులే కాకుండా మండలం నలుమూలల నుంచి ప్రజలు అధికసంఖ్యలో హాజరై అమ్మవారికి పూజలు నిర్వహించారు.


గజ్జలమ్మ ఆలయ వార్షికోత్సవాన్ని ప్రారంభిస్తున్న నిర్వాహకులు

భక్తి శ్రద్ధలతో గ్రామ దేవతలకు బోనాలు


తరోడాలో బోనాల పండుగ జరుపుకుంటున్న దృశ్యం

ముథోల్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తరోడా, చించాల తదితర గ్రామాల్లో ఆదివారం గ్రామ దేవతలకు బోనాలు సమర్పించారు. తెల్లవారు జాము నుంచి గ్రామ దేవతలకు మహిళలు బోనాలు తీసుకెళ్లి ప్రత్యేక నైవేద్యాలతో మొక్కులు తీర్చుకున్నారు. పోతురాజుల విన్యాసాలు, డప్పు చప్పుళ్లతో గ్రామంలో మహిళలు బోనాలతో ఊరేగింపు నిర్వహించారు. తమ కుటుంబ సభ్యులు ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో ఉండటంతో పాటు పాడి పంటలు సమృద్ధిగా పండుతాయని వీరి నమ్మకం.

ఘనంగా వేంకటేశ్వర స్వామి నాగవెల్లి

దిలావర్‌పూర్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గుండంపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి నాగవెల్లిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. అంతకు ముందు ఉదయం గణపతి విశ్వక్సేనా పూజ, పుణ్యాహవచనం, స్థాపితా దేవత పూజలు, హవనం, పూర్ణాహుతి, ఉద్వాసన, మహా కలశ ప్రోక్షణ, చక్ర తీర్థం, నాగవెల్లి నిర్వహించారు. సాయంత్రం ద్వాదశ ఆరాధన, ధ్వజారోహన, సప్తావరణం, ఏకాంత సేవ, దీపోత్సవం కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం మంగళహారతి, భక్తులకు తీర్థ ప్రసాద వితరణ చేశారు. దేవస్థానం అభివృద్ధి కమిటీ సభ్యులు, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.


వేంకటేశ్వర స్వామివారికి నాగవెల్లి నిర్వహిస్తున్న పండితులు

కన్నుల పండువగా అభయాంజనేయ విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు


విద్యుద్దీపాలతో శోభాయమానంగా అలంకరించిన అభయాంజనేయ మందిరం


ఆలయ ప్రాంగణంలో నిర్వహిస్తున్న చండీ హోమం

● ఆలయ ప్రాంగణంలో చండీ హోమం

● నేడు విగ్రహ ప్రతిష్ఠాపన

భైంసా, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని భాగ్యనగర్ కాలనీ పరిధిలో శ్రీ అభయాంజనేయ మందిర, విగ్రహాల ప్రతిష్ఠాపన మహోత్సవాలు కన్నుల పండువగా కొనసాగుతున్నాయి. శనివారం ప్రారంభమైన వేడుకలు సోమవారం నిర్వహించే గణపతి, దేవి, శ్రీ వల్లి దేవ సేన సహిత సుబ్రహ్మణ్య, మహాలింగ నంది, అంజనేయాది విగ్రహాల స్థాపనతో ముగియనున్నాయి. వేడుకలలో భాగంగా శనివారం విగ్రహాలకు జలదివాస్ నిర్వహించిన వేద పండితులు ఆదివారం పుష్ప, ఫల,ధాన్యాది వాసాల కార్యక్రమాలను చేపట్టారు. ఇందులో భాగంగానే ఆలయ ప్రాంగణంలో విగ్రహాల ప్రతిష్ఠాపనోత్సవాన్ని పురస్కరించుకొని చండీ హోమం నిర్వహించారు. కాలనీ పరిధిలోని పలువురు దంపతులు హోమం పాల్గొన్నాయి. ఉదయం నుంచి రాత్రి వరకు ఆలయ ప్రాంగణంలో వివిధ ప్రాంతాల భజన మండలీలు భజన కార్యక్రమాలు చేపట్టాయి.

అభయాంజనేయ మందిరంలో సోమవారం విగ్రహాల ప్రతిష్ఠాపన కార్యక్రమం జరుగనుంది. ఇందు కోసం గాను ఆలయాన్ని సర్వంగా సుందరంగా ముస్తాబు చేశారు. విద్యుత్ దీపాలతో శోభయమానంగా అలంకరించారు. ఉదయం 10.01 గంటలకు వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య గణపతి, దేవి, శ్రీ వల్లి దేవ సేన సహిత సుబ్రహ్మణ్య, మహాలింగ నంది, అంజనేయాది విగ్రహాల ప్రతిష్ఠాపనోత్సవం జరుగనుంది. ఇదే క్రమంలో ఆలయ శిఖర స్థాపన, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు చేపట్టనున్నారు. అనంతరం ఆలయ కమిటీ భారీ అన్నధాన కార్యక్రమం నిర్వహించనుంది.

ఐక్యమత్యంతోనే మాలీలకు సామాజిక న్యాయం

● మాలీ మహా సంఘం జాతీయ అధ్యక్షుడు విలాసరావుపాటిల్


మాట్లాడుతున్న జాతీయ అధ్యక్షుడు విలాసరావు పాటిల్

ఆదిలాబాద్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మాలీలంతా ఐక్యమత్యంగా ఉంటేనే దేశ వ్యాప్తంగా సామాజిక న్యాయం పొందగలుగుతారని ఇందుకు తెలంగాణ మాలీ ఉదాహరణ అని అఖిల భారతీయ మాలీ మహాసంఘం జాతీయ అధ్యక్షుడు విలాస్ రావు పాటిల్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని యాదవ సంఘం భవనంలో ఏర్పాటు చేసిన మాలీ మహా సమ్మేళనానికి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ మాలీలు తమ పోరాటాల ద్వారానే ప్రభుత్వంపై ఒత్తిడి పెంచి అసెంబ్లీలో తీర్మానం చేసి ఎస్టీ హోదా బిల్లుని కేంద్రానికి పంపగలిగారన్నారు. అది కేంద్రం ఆమోదించాలంటే మాలీలంతా ఐక్యమత్యంగా ఉండి ఎస్టీ హోదా లభించే వరకు పోరాటాలు సాగించాలని పిలుపునిచ్చారు. అలాగే మహాత్మజ్యోతి బాపూలే సావిత్రిబాయి పూలేల స్ఫూర్తితో విద్యా వంతులైన మాలీలు యువకులు, మహిళలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా జరిగిన ఎన్నికల్లో నాల్గవ సారిగా మాలీ మహా సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా సుకుమార్ పెట్కూలే, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా సాంబన్న, రాష్ట్ర కోశాధికారిగా సతీష్, రాష్ట్ర ఉపాధ్యక్షులుగా సురేష్ గుర్నూలే, రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షునిగా శంకర్ నాగోశే, ఉపాధ్యక్షులుగా నారాయణ గురు నూలే ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇందులో జాతీయ స్థాయి నేతలు శివదాస్‌మహాజన్, భగవంతు రావు కొట్రంగే, గుజరాత్‌మలి మహాసంఘ అధ్యక్షుడు శ్యామరావు పూలే, మహారాష్ట్ర మాలీ మహా సంఘ అధ్యక్షుడు అడ్వొకేట్ రాజేంద్ర మహాడోలే, మధ్యప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు దిలీప్‌నేవాసే పాటిల్, రఘునాథ్ డోక్ తదితరులు పాల్గొన్నారు.

చికెన్ వ్యర్థాలతో దుర్గంధం

కుభీర్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని వివేకానంద చౌరస్తా నుంచి పార్డి(కే) గ్రామానికి వెళ్లే రహదారి ఎడమవైపున చికెన్ వ్యర్థాలను రోడ్డు పక్కన పారేయడంతో ఆ మార్గాన వెళ్లే వాహనాదారులు, వాకింగ్ చేస్తున్న వారు దుర్గంధంతో పాటు కుక్కల బెడదతో ఇబ్బందులు పడుతున్నారు. చికెన్ సెంటర్ నిర్వాహకులు ఇష్టా రాజ్యాంగా వ్యవహరిస్తు రోడ్డు పక్కన పార వేయడంతో దుర్గంధంతో పాటు గాలి వీచినప్పుడు కోడి బూరు మీద పాటు రహదారిపై చేరి అపరిశుభ్రంగా మారుతోందని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


రోడ్డు పక్కన కోడిబూరు, చికెన్ వ్యర్థాలు

శివాలయం నిర్మాణానికి భూమి పూజ

బోథ్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): సోనాల మండలం లోని కౌటా(కె) గ్రామంలో శివాలయ నిర్మాణానికి ఆదివారం గ్రామస్థులు భూమి పూజ చేశారు. 20 ఏళ్ల క్రితం కేంద్ర పరుశురాం అనే రైతుకు చెందిన చేనులో శివలింగం వెలిసింది. అయితే గ్రామస్థులు శివలింగాన్ని ప్రతిష్ఠించి ప్రతీ యేటా పూజలు నిర్వహిస్తున్నారు. తాత్కాలికంగా షెడ్డు ఏర్పాటు చేసి శివ పార్వతుల కల్యాణం నిర్వహిస్తుండేవారు. అయితే ఈ ఏడాది గ్రామానికి చెందిన నాందేవ్ కేంద్రీ కుమారుడు న్యాయవాది అయిన రమేష్ ఆలయ నిర్మాణానికి ముందుకు రావడం జరిగింది. అంతేగాక గుడి కోసం స్థలాన్ని విరాళంగా ఇచ్చారు. గుడి నిర్మాణం కోసం స్థానికుడైన డాక్టర్ శంకర్, డాక్టర్ అనీస్ ముందుకు రావడంతో గుడి నిర్మాణం కోసం భూమి పూజ చేశారు. ఆలయ నిర్మాణానికి దాతలు సహకరించినట్లయితే ఆలయం పూర్తి స్థాయిలో రూపుదిద్దుకొని ఉంది అని గ్రామస్థులు పేర్కొంటున్నారు.



కౌటా(కె) గ్రామంలో శివాలయం నిర్మాణానికి భూమిపూజ

ఫోటో న్యూస్


కుండలను తయారు చేస్తున్న దృశ్యం





అమ్మేందుకు సిద్ధంగా ఉన్న కుండలు



చల్లటి నీటికి కేరాఫ్ అడ్రస్.. ఆదిలాబాద్ రంజన్

వేసవి సమీపిస్తున్న నేపథ్యంలో చల్లటి నీటికి కేరాఫ్ అడ్రస్‌గా నిలిచే ఆదిలాబాద్ రంజన్ల తయారీ ముమ్మరంగా సాగుతుంది. ఉమ్మడి తెలుగురాష్ట్రాల్లో ఆదిలాబాద్‌లో తయారయ్యే రంజన్లకు మంచి గిరాకీ ఉంది. మహా రాష్ట్ర నుంచి తెప్పించే ప్రత్యేకమైన గుర్రపు పేడ, మట్టితో వీటిని తీర్చి దిద్దుతున్నారు. మండు వేసవిలోను వేడిని మరిపించేలా చల్లటి నీటిని తాగేందుకు రంజన్లను జనాలు కొనుగోలు చేస్తారు. పేదోడి ఫ్రిజ్‌గా పేరుగాంచిన రంజన్ల వినియోగం ఆరోగ్య కారణాలతో మరింతగా పెరిగింది.

● (ఆంధ్రజ్యోతి, ఆదిలాబాద్ స్టాఫ్ ఫోటోగ్రాఫర్)







సోనాపూర్ గ్రామంలో నిర్మించిన ఇళ్లు



ముర్రిపేట్‌లో నిర్మాణంలో ఉన్న ఇళ్లు

అభివృద్ధికి.. ఆమడదూరంలో..!

- జిల్లాలో అడవులకే పరిమితమవుతున్న ఏజెన్సీ ప్రాంత ప్రజలు
- కనీస సౌకర్యాలకు నోచుకోని మారుమూల ఆదివాసీ గిరిజన గ్రామాలు
- అటవీ ఉత్పత్తులతోనే కాలం వెల్లదీస్తున్న పలు ఆదివాసీ తెగలు
- సీసీడీపీ పథకం ద్వారా ఇళ్లు మంజూరు చేస్తామన్న కేంద్ర ప్రభుత్వం
- 2023లో రూ.25 కోట్ల వ్యయంతో వెయ్యి మందికి నిర్మించాలని నిర్ణయం
- ఉమ్మడిజిల్లాలోని 77 గ్రామాల్లోవేలాది సంఖ్యలో తోటి, కోలాం గిరిజనులు

ఉట్నూర్, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): అంతరించి పోతున్న ఆదివాసీల తెగలలో కోలాం, తోటి ఆదిమ గిరిజనులు ఇంకా అభివృద్ధికి దూరంగానే ఉండిపోతున్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75ఏళ్ల గడిచిపోయినా.. ఆదిమ గిరిజనులు ఇంకా అడవులకు పరిమితమై జీవిస్తున్నారు. జిల్లాలోని గిరిజనుల సమగ్ర అభివృద్ధి కోసం ఐటీడీఏ ఏర్పాటు చేసి ఐదు దశాబ్దాలు కావొస్తున్నా.. గిరిజనుల అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉంది. ఉమ్మడి జిల్లాలోని 177 గిరిజన గ్రామాలలో ఆదిమ గిరిజనులైన తోటి, కోలాం, గిరిజనులు వేలాది సంఖ్యలో జీవిస్తున్నారు. కొండ కోనల్లోని రహదారుల సైతం లేని మారుమూల గ్రామాలలో ఏరి పారేసినట్లు ఆదిమ గిరిజనులు తమ జీవితాలను వెల్లదిస్తున్నారు. కొల్లం గిరిజనులు బుట్టలు, తడకలు వెదరుతో అల్లుతు, పోడు వ్యవసాయం చేస్తూ జీవనోపాధి పొందుతుండగా, తోటి గిరిజనులు సంచార జీవనం సాగిస్తు గిరిజన గ్రామాలను పర్యటిస్తూ.. గోండుల ఇళ్లలో కథలు చెబుతూ.. వారిని సంతృప్తి పరిచి వారు ఇచ్చే ధాన్యంతో జీవిస్తు న్నారు. ఇప్పుడిప్పుడే కొందరు ఆదిమ గిరిజనులు తమ పిల్లలను ఆశ్రమ పాఠశాలలో చేర్పిచదివిస్తున్నారు. చాలా గ్రామాలకు రోడ్లు తాగునీరు సాగు నీరు, విద్యుత్ సౌకర్యం అందించే దిశగా ప్రభుత్వం కృషి చేయాల్సి ఉంది. కొన్ని గ్రామాలకు సోలార్ వెలుగులు అందించే ఏర్పాట్లు ఐటీడీఏ అధికారులు చేపడుతున్నారు.

ఇళ్లు మంజూరు చేశారు.. నిధులు మరిచారు

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని పీవీటీజీ గిరిజనులైన తోటి, కోలాం గిరిజనులకు కేంద్ర ప్రభుత్వం ఇళ్లు మంజూరు చేయాలని భావించింది. సీసీడీపీ పథకం ద్వారా 2023లో రూ.25కోట్లు మంజూరు చేసి, వెయ్యి మంది లబ్ధిదారులకు ఇళ్లు నిర్మించాలని నిర్ణయించింది. ఆదిలాబాద్ జిల్లాలోని ఉట్నూర్ గాదీగూడ నార్నూర్ సిరికొండ గుడిహత్నూర్, తలమడుగు, తాంసి, భీంపూర్, బేల, మావల, జైనథ్, ఆదిలాబాద్ మండలాల్లో కోలాం, తోటి గిరిజనులను లబ్ధిదారులుగా గుర్తించారు. దీనిలో భాగంగా ఆదిలాబాద్ జిల్లాలో ఒక వంద ఐదు గ్రామాలలో 486 ఇళ్లు, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో జైనూర్ ఆసిఫాబాద్ లింగాపూర్, వాంకిడి, తిర్యాని మండలాల్లో 296 ఇళ్లు, మంచిర్యాల జిల్లాలో జన్నారం, దండెపల్లి లక్సెటిపేట తాండూరు కాసిపేట మండలంలో 128 ఇళ్లు, నిర్మల్ జిల్లాలోని సారంగాపూర్ మండలంలో 90 ఇళ్లు మంజూరు చేశారు. అయితే, ఒక్కో ఇంటికి రూ.2.50 లక్షలు కేటాయించడంతో పాటు అత్యవసరం అయిన ఇళ్ల లబ్ధిదారులను గుర్తించి ఇళ్లు మంజూరు చేయడంతో ఉట్నూర్ మండలంలోని చెరువుగూడా నాగపూర్, కోలంగూడ, కుమ్మరికుంట, ముర్రిపేట్, జెండాగూడ, లక్కారం, నవోదయనగర్, రాంజీగోండునగర్ సోనాపూర్, మానిగూడ, రాజంపేట, బొప్పరిగుంట, ధర్మాజిపేట్‌లలో గృహాల నిర్మాణం పనులు కొనసాగుతున్నాయి.

నిధులు రాక నీరసిస్తున్న లబ్ధిదారులు

రెక్కాడితే గాని డొక్కాడని ఆదిమ గిరిజనులైన కోలాం, తోటి గిరిజనులకు ఇళ్లు కట్టుకోవాలని ప్రభుత్వం అంతంత మాత్రమే నిధులు కేటాయించింది. అందునా అవి కూడా సకాలంలో విడుదల చేయకపోవడంతో నిధులు రాక లబ్ధిదారులు నీరసించి పోతున్నారు. 2023 నుంచి ప్రారంభమైన ఇళ్లలో ఐటీడీఏ ఇంజనీర్ శాఖ అధికారుల ఆధ్వర్యంలో వెయ్యి ఇళ్ల నిర్మాణానికి రూ.25.14కోట్లు అవసరం కాక ఇప్పటి వరకు కేవలం రూ.8.55 కోట్లు మాత్రం

(తరువాయి 6వ పేజీలో...)



అంతంతమాత్రంగానే ఇళ్ల నిర్మాణం

: టేకం భీంరావు, ఆదిమ గిరిజనుడు, నాగపూర్

ఆదిమ గిరిజనులైన కోలాం, తోటి గిరిజనులకు కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్ల నిర్మాణానికి కేటాయించిన నిధులు ఏమాత్రం సరిపోవడం లేదు. దీంతో అంతంతమాత్రంగానే ఇళ్ల నిర్మాణం పూర్తయ్యాయి. ఇందులో భాగంగా ఒక గదితో పాటు స్నానాల గది నిర్మించుకున్నాం. ఇంకా బిల్లులు సరిగ్గా రాక ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నాం.

పైనుంచి నిధులు రావాల్సి ఉంది

: జాదవ్ తానాజి, ఈఈ, ఐటీడీఏ, ఉట్నూర్

ఉమ్మడి జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతంలో గల మారుమూల గ్రామాలలో ఐటీడీఏ ఇంజనీరింగ్ శాఖ ఆధ్వర్యంలో ఇళ్ల నిర్మాణం చేపట్టారు. దీనిలో భాగంగా కోలాం, తోటి గిరిజనుల వెయ్యి గృహాలకు ప్రభుత్వం రూ.25కోట్లు మంజూరు చేసింది. కాని ఇప్పటి వరకు పూర్తి నిధులు రాలేదు. నిధుల కోసం ఉన్నతాధికారులకు నివేదించాం.



మహానందికి పూజలు చేస్తున్న భక్తులు, గ్రామస్థులు



వాగు వద్ద అభిషేకం కోసం నీటిని సేకరిస్తూ..

నందిగామలో మహానందికి ప్రత్యేక పూజలు

- నేడే నూతన శివాలయ ప్రారంభోత్సవం

తలమడుగు రూరల్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బరంపూర్ గ్రామ పంచాయతీ పరిధిలో గల నందిగామలో నూతనంగా నిర్మించిన ఆలయంలో భక్తులు, గ్రామస్థులు మహానందికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. గ్రామ సమీపంలోని వాగు వద్ద నంది నోటి నుంచి వస్తున్న వాగు నీటిని భక్తులు తీసుకొచ్చి మహానందికి ఆలయంలో పంచామృతంతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్మాణ దాత ముడుపు దామోదర్‌రెడ్డి మాట్లాడుతూ నందిగామ గ్రామ ప్రాంతంలో గల మహా శివాలయానికి దశాబ్దాల చరిత్ర ఉందన్నారు. తన తండ్రి ముడుపు భూమారెడ్డి సహకారం, కుటుంబ సభ్యుల ప్రోత్సాహం, నందిగామ గ్రామస్థుల ప్రోద్బలంతో నూతన శివాలయ నిర్మాణం, విగ్రహ ప్రతిష్ఠాపన అవకాశం లభించినందుకు ప్రతీ ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. ఈనెల 10న సోమవారం రోజున వేద పండితులతో నూతన శివాలయ నిర్మాణ ప్రారంభోత్సవం విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి అధికసంఖ్యలో భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ముడుపు ప్రేమేందర్‌రెడ్డి, ముడుపు మానిష్ రెడ్డి, కేదారేశ్వర్ రెడ్డి, గ్రామ పటేల్‌లు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.



విగ్రహాలతో ఊరేగింపు నిర్వహిస్తున్న గ్రామస్థులు



పూజలు చేస్తున్న డీసీసీబీ చైర్మన్ దంపతులు

పోచమ్మ ఆలయంలో యజ్ఞం

భీంపూర్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వాడూర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన మహా పెద్ద పోచమ్మ ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన సందర్భంగా ఆదివారం విగ్రహాలను డప్పు వాయిద్యాల నడుమ ఊరేగింపు నిర్వహించారు. అనంతరం యజ్ఞం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆదిలాబాద్ డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి దంపతులు యజ్ఞంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా భోజారెడ్డి మాట్లాడుతూ సోమవారం పెద్ద పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన ఉంటుందని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని అన్నారు. యజ్ఞంలో గ్రామ పెద్దలు చిలుకూరి సంజీవ్‌రెడ్డి, హనుమాన్ దాస్, అడ్డి శ్రీనివాస్‌రెడ్డి, తూటి భోజన్న, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఉర్సు ఉత్సవాలు

ఆదిలాబాద్, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ రూరల్ మండలంలోని చాందా(టీ)లోని రాజన్షా వలీ దర్గా ఉర్సు ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. ఈ నెల 4వ తేదీ నుంచి ఉత్సవాలు శనివారంతో ముగియగా.. ఆదివారం ఖవ్వాలి కార్యక్రమాన్ని నిర్వహించారు. మహారాష్ట్ర నుంచి గాయకులు రాజన్‌షా వలీని కీర్తిస్తూ ఖవ్వాలి పాడుతూ ఉత్సహపరిచారు. కాగా మాజీ మంత్రి జోగు రామన్న ఉత్సవాల చివరి రోజు దర్గాకు చేరుకొని ప్రత్యేక ప్రార్ధనాలు చేశారు. కార్యక్రమంలో దర్గా కమిటీ అధ్యక్షులు అశ్రఫ్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి భూమిపూజ

బోథ్, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): సోనాల మండలంలోని కౌటా(కె) గ్రామంలో శివాలయ నిర్మాణానికి ఆదివారం గ్రామస్థులు భూమిపూజ చేశారు. గత 20 ఏళ్ల క్రితం కేంద్ర పరుశురాం అనే రైతుకు చెందిన చేనులో శివలింగం వెలసింది. అయితే గ్రామస్థులు శివలింగాన్ని ప్రతిష్ఠాపించి ప్రతిఏటా పూజలు నిర్వహిస్తున్నారు. తాత్కాలిక షెడ్డు ఏర్పాటు చేసి శివపార్వతుల కల్యాణం నిర్వహిస్తుండేవారు. కాగా, ఈయేడు స్థానికుడు న్యాయవాది రమేష్‌తో పాటు శంకర్, అసిస్‌లు ముందుకు రావడంతో గుడి నిర్మాణం కోసం భూమిపూజ చేశారు. దాతలు సహకరించినట్లయితే ఆలయం పూర్తి స్థాయిలో పూర్తవుతుందని గ్రామస్తులు పేర్కొంటున్నారు.



కౌటా(కె) గ్రామంలో భూమిపూజ చేస్తున్న భక్తులు

మార్చి 8న ఆదిలాబాద్‌లో

అంతర్జాతీయ శ్రామిక మహిళా దినోత్సవం

- ఉట్నూర్ రౌండ్ టేబుల్ సమావేశంలో తుడుందెబ్బ నిర్ణయం
- పాల్గొన్న ఆదివాసీ, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, తదితరులు

ఉట్నూర్, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం కార్యక్రమాన్ని జిల్లాకేంద్రంలో నిర్వహించాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడందెబ్బ నిర్ణయించడం జరిగిందని జిల్లా అధ్యక్షుడు పెందూరు దాదిరావు ప్రకటించారు. ఆధివారం మండల కేంద్రంలోని ఆదవాసీ భవన్‌లో ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడందెబ్బ, ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాలు అనుబంధ సంఘాలు సార్‌మేడిలు ఆయా గ్రామాల పటేల్‌లు అందరు కలిసి రౌండ్‌టేబుల్ సమావేశంలో ఏకగ్రీవంగా వచ్చేనెల 8న జిల్లాకేంద్రంలో అంతర్జాతీయ శ్రామిక మహిళ దినోత్సవం, సభను ఆదివాసీ మహిళ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించాలని నిర్ణయించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా పెందూరు దాదిరావు, వెట్టి మనోజ్ గోడం రేణుక మాట్లాడుతూ ఆకాశంలో సగం, భూమిలో సగం, ప్రపంచంలో సగభాగమైన స్త్రీ ఆధునిక యుగంలో కూడా వివక్షతకు గురవుతునే ఉందని, తరాలు మారిన మహిళల తలరాతలు మారలేదని, స్త్రీ చరిత్ర లేనిదే ప్రపంచ మార్పు లేదని, ఆదివాసీ స్త్రీ రక్తం చుక్క రాని చిరత్ర అంటూ లేదని, అడుగడుగునా స్త్రీల బలహీనతలను బానిసగా మార్చి మతాల ముసుగులో మనధర్మం కన్నుసన్నల్లో మన దేశం మహిళలను అనిచి వేస్తునే ఉందన్నారు. ప్రపంచ సామ్రాజ్యవాద విష సంస్కృతిలో అంగడి సరుకుగా వ్యాపారం చేస్తూ పురుషాదిక్యత కొనసాగుతుందని విచారం వ్యక్తం చేశారు. పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన దేశాల్లో మహిళలు తాము విలాస వ్యాపార వస్తువులను కాదు మేము కూడా సంఘ జీవులమని, దేనిలో తక్కువ కాదని పేర్కొంటూ 1909 ఫిబ్రవరి 28న శ్రామిక మహిళలకు జీవించే హక్కు కల్పించాలని డిమాండ్‌తో మొదలైన ఉద్యమం అమెరికా దేశంలో ప్రారంభమై రష్యా, జర్మనీ, డెన్మార్క్ ప్రపంచమంతటా పోరాటాలు కొనసాగాయన్నారు. మహిళా లోకం గొంతెత్తిన రోజు అదే ఫిబ్రవరి 1909 రోజు తర్వాత, 1910 రెండవ శ్రామిక మహిళా అంతర్జాతీయ సదస్సులో క్లార జెట్కిన్ మహిళలకు పని చేసే ప్రదేశాలలో మెరుగైన సౌకర్యాలు శ్రమకు తగ్గ వేతనం పని గంటలు తగ్గించాలని, వివక్షత అసమానతు వ్యతిరేకంగా ఓటు హక్కు కోసం పోరాడారన్నారు. ఆకలితో అసమానలతో చావడం కన్న పోరాడుతూ చావడమే మేలు అన్నారు. ఈ నినాదం ప్రపంచాన్ని కదిలించిందని అంతర్జాతీయ విధుల్లో చర్చకు వచ్చిందని మహిళల ఐక్యతను పెంపొందించడానికి ఒక వేదిక కావాలని ప్రపంచ దేశాలు మహిళా దినోత్సవం రోజును ప్రకటించాలని, అలాగే 1997లో ఐక్య రాజ్య సమితి అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని సభ్య దేశాలు జరుపుకోవాలని పిలుపునివ్వడం జరిగిందన్నారు. అప్పటి నుంచి మహిళ లోకం అంతా జరుపుకుంటున్నారన్నారు. ఇందులో ఉయిక సుదర్శన్, పెద్ది సంతోష్, కనక ప్రభాకర్, కుంరం యాదోరావు, తొడసం నాగోరావు, రాగల్‌జెండా ఇంద్రవెల్లి అధ్యక్షుడు కుంరకేసు, మడావి సాగర్, ఆత్రం పరమేశ్వర్, వెడ్మ ముకుంద్‌రావు, తదితరులు పాల్గొన్నారు.



రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు దాదిరావు

వృత్తితో పాటు సామాజిక సేవల్లో రాణించడం అభినందనీయం

- డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్

ఆదిలాబాద్, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): వృత్తితోపాటు సామాజిక సేవల్లో డెంటల్ అసోసియేషన్ సభ్యులు రాణించడం అభినందనీయమని డీఎంహెచ్‌ఓ డాక్టర్ నరేందర్ రాథోడ్ అన్నారు. ఆదివారం ఓ బ్లాంకెట్ హాలులో ఇండియాన్ డెంటల్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకరణం నిర్వహించారు. దీనికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై అధ్యక్షులు సాయిరాంతో ప్రమాణ స్వీకరం చేయించారు. అనంతరం ప్రధాన కార్యదర్శి చిన్మయ్‌ఋషి ప్రమాణస్వీకరం చేసి కార్యవర్గ సభ్యులను డీఎంహెచ్‌ఓకు పరిచయం చేశారు. అనంతరం డీఎంహెచ్‌ఓతోపాటు నూతన కార్యవర్గ సభ్యులను సత్కరించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ కల్యాణ్ రెడ్డి, ప్రకాష్, ప్రమోద్‌రెడ్డి, సమీయోద్దీన్, ఐడీఏ కోశాధికారి సంజీవ్ కుమార్, ఉపాధ్యక్షులు స్వప్నిల్, రత్న, సంయుక్త కార్యదర్శి నిఖిల్ రెడ్డి, అసిస్టెంట్ కార్యదర్శి భవన పాల్గొన్నారు.

కొన్ని ప్రాంతాలకే అభివృద్ధి పరిమితం

- ఉత్తర తెలంగాణ అభివృద్ధి ఫోరం వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ కేశవులు

ఆదిలాబాద్, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): నీరు, నిధులు, నియమకాలు అనే నినాదంతో ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించుకున్న అభివృద్ధి మాత్రం కొన్ని ప్రాంతాలకే పరిమితం అయిందని ఉత్తర తెలంగాణ అభివృద్ధి ఫోరం వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ కేశవులు అన్నారు. ఆదివారం మున్నూరుకాపు సంఘ భవనంలో ఉత్తర తెలంగాణ అభివృద్ధిపై అవగాహన కార్యక్రమాన్ని ఫోరం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆ తర్వాత రాజకీయ పార్టీల నాయకులు హాజరై వారి అభిప్రాయాలను తెలిపారు. అనంతరం మున్నూరుకాపు సంఘం తరపున డాక్టర్ కేశవులను సత్కరించారు. కార్యక్రమంలో ఆ పార్టీలు, సంఘాల నాయకులు కాళ్ల విఠల్, కలల శ్రీనివాస్, జగన్ సింగ్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చైర్మన్ డాక్టర్ కేశవులు

ఎమ్మెల్యేను కలిసిన పలు గ్రామాల ప్రజలు

నేరడిగొండ, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ను ఆదివారం నేరడిగొండలో గల తన నివాసంలో బజార్హత్నూర్ మండలంలోని కొల్హారి, బలాన్‌పూర్, కొత్తపల్లి గ్రామస్థులు, బోథ్ మండలంలోని సాయినగర్ కాలనీ వాసులు, గుడిహత్నూర్ మండలంలోని మన్నూర్ గ్రామస్థులు మర్యాద పూర్వకంగా కలిసి పలు సమస్యలను విన్నవించారు. బజార్హత్నూర్ మండలంలో గల బాలన్‌పూర్ గ్రామాన్ని ప్రత్యేక గ్రామ పంచాయితీగా ఏర్పాటు చేయాలని వినతి పత్రం అందజేశారు. ఈనెల 12, 13వ తేదీల్లో కొల్హారి గ్రామంలో పులాజీబాబా ఆశ్రమంలో జరిగే అధ్యాత్మిక వార్షికోత్సవానికి హాజరు కావాలని ఆహ్వాన పత్రికను అందజేశారు. గుడిహత్నూర్ మండలంలోని మన్నూర్ గ్రామంలో ఈనెల 11వ తేదీ నుంచి ప్రారంభమయ్యే సప్త కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరు కావాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ను ఆహ్వాన పత్రికను అందజేశారు.



బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ను కలిసిన మన్నూర్ గ్రామస్థులు

- పరిమాండల్ జగదాంబ దేవికి ప్రత్యేక పూజలు

నేరడిగొండ: మామాడ మండలంలోని పరిమాండ్‌లో గల జగదాంబ దేవి ఆలయంలో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. వీరి వెంట నేరడిగొండ మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్, ఇంద్రవెల్లి మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీరామ్ నాయక్, ఇచ్చోడ మాజీ ఎంపీటీసీ నర్వడే రమేష్, బీఆర్ఎస్ నాయకులు ప్రతాప్, తదితరులు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో ఆలయ వార్షికోత్సవం

బోథ్, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని కుచ్చులాపూర్ గ్రామం శబరిమాత ఆశ్రమ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం హోమ గుండం నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితులు పండరి శర్మ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ భక్తులు హోమగుండం వద్ద ప్రత్యేక పూజ కార్యక్రమాలను నిర్వహించారు. మొదట ధ్వజారోహణ కార్యక్రమాన్ని నిర్వహించిన అనంతరం ప్రత్యేక పూజలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో మండలంలోని పలు గ్రామాల నుండి భక్తులు పాల్గొని నిర్వహించారు. వచ్చిన భక్తులకు ఆశ్రమ నిర్వాహకులు అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు.

కుస్లాపూర్ గ్రామంలోని శబరిమాత ఆలయంలో హోమగుండం వద్ద పూజలు నిర్వహిస్తున్న భక్తులు

